క్లుప్తంగా

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

పచ్చదనం పెంపునకు చర్యలు


మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరమంతా పచ్చదనం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం కమిషనర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. తొలి విడతగా 5 వేల మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మొత్తం 20 వేల మొక్కలు నాటాలని సూచించారు. ప్రజా ప్రతినిధులచే లాంఛనంగా ప్రారంభిస్తామని చెప్పారు. మొక్కలు నాటేందుకు గుంతలను సులువుగా వేగంగా తవ్వేందుకు ప్రయోగాత్మకంగా రెండు ఎర్త్ ఆగర్ యంత్రాలను తెప్పించినట్లు చెప్పారు. మంచి ఫలితాలు వస్తే మరిన్ని యంత్రాలను తెప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రహదారులు, పార్కులు, విశాలమైన ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. వచ్చే నెల 15వ తేదీలోపు నగరంలో 20 వేల మొక్కలు నాటే ప్రక్రియ పూర్తి చేస్తామని వెల్లడించారు.

పాణ్యం ఎమ్మెల్యేకు సన్మానం

కర్నూలు(హాస్పిటల్): కురువ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని ఘనంగా సన్మానించారు. పాత కల్లూరులో భారీ ర్యాలీ నిర్వహించి ఆమెకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ ఎస్‌వీ రామకృష్ణ, కురువ శ్రీనివాసులు, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు ఎస్.ఫిరోజ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సాంస్కృతిక మండలిని పునరుద్ధరించాలి


మంత్రి దుర్గేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: జిల్లా సాంస్కృతిక మండలిని పునరుద్ధరించాలని, కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య వినతి పత్రం అందజేశారు. ఆదివారం నంద్యాలలో మంత్రిని కలిసి కళాకారుల సమస్యలపై విన్నవించారు. గత కొన్ని సంవత్సరాలుగా సాంస్కృతిక మండలి మూత పడిందని, పేద కళాకారులకు ఆర్థిక సాయం చేయాలని, వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయాలని తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

శ్రీశైల దేవస్థానానికి రూ. 3 లక్షల విరాళం


అన్నదాన పథకానికి విరాళం అందిస్తున్న కర్నూలుకు చెందిన బి.లక్ష్మమ్మ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న పలు సేవా పథకాలకు ముగ్గురు భక్తులు విరాళాలు అందించారు. నిత్యాన్న పథకానికి కర్నూలుకు చెందిన బి.లక్ష్మమ్మ రూ.1,00,001, నాగర్‌కర్నూలుకు చెందిన జి.అశోక్‌కుమార్ రూ.1,01,116, గో సంరక్షణ పథకానికి గుంటూరుకు చెందిన పాలిశెట్టి ఆనంద్ గోపిసాయి కృష్ణ రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. విరాళాలను అందించిన దాతలను దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

'వైల్డ్ విజన్ గ్లోబల్ చాలెంజ్'కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

నంద్యాల(న్యూటౌన్): అడవులు, జీవవైద్యం, వన్యప్రాణులపై అవగాహన కల్పించేందుకు వైల్డ్ విజన్ గ్లోబల్ చాలెంజ్ నిర్వహిస్తున్న కార్యక్రమానికి విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. ప్రకృతి పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు www.academy.wwfindia.orf/widwirdom వెబ్‌సైట్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

చర్చా.. రచ్చా!

- 5 నెలల తరువాత కౌన్సిల్ సమావేశం
- మారిన సమీకరణాలు
- కౌన్సిల్‌లో 8 నుంచి 16కు పెరిగిన టీడీపీ బలం
- 11 అజెండా అంశాలపై చర్చించనున్న పాలక, ప్రతిపక్ష సభ్యులు
- తొలిసారి పాల్గొంటున్న మంత్రి టీజీ, కర్నూలు ఎంపీ, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు
- నేడు నగరపాలక సర్వసభ్య సమావేశం



కర్నూలు నగర పాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్): కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఇటీవల నగర పాలకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారాయి. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సమావేశం జరిగాక సుదీర్ఘంగా 5 నెలల తరువాత ఈ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. కౌన్సిల్‌లో తెలుగుదేశం పార్టీకి 8 మంది కార్పొరేటర్లు ఉన్నా రెండు నెలల వ్యవధిలో తాజా పరిణామాల నేపథ్యంలో అది కాస్తా 16 (పాణ్యం, కోడుమూరు అర్బన్) కు చేరుకుంది. పలువురు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఆ పార్టీలో చేరారు. దీంతో కాస్త బలం పుంజుకోవడంతో సమావేశం కాస్తా వాడీవేడిగా సాగనుంది. చర్చ.. రచ్చ గాకుండా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్న డిమాండ్ ఉంది.

11 అజెండా అంశాలపై చర్చ

సర్వసభ్య సమావేశంలో 11 అభివృద్ధి అంశాలకు సంబంధించి అజెండాలో చేర్చారు. అందులో ప్రధానంగా నగరంలో ప్రధాన పైపులైన్ పనులు, కింగ్ మార్కెట్ పార్కు అభివృద్ధి, ముస్లింల శ్మశాన వాటిక, పాతబస్టాండ్ వద్ద డ్రైయినేజీ, 51వ వార్డులో సీసీ డ్రైన్, డిస్పోజబుల్ డ్రైన్, పరిమళ నగర్‌లో పార్కుల అభివృద్ధి వంటి రూ.5.94 కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులపై పాలక సభ్యులు చర్చించి ఆమోదం వ్యక్తం చేయాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు పెంచిన వేతనాలకు ఆమోదం వ్యక్తం చేయాల్సి ఉంటుంది. ఇక నగర పాలకలో అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. దోమలు, పందులు, పారిశుద్ధ్య లోపం వంటి సమస్యలు నెలకొన్నాయి. ఇంటింటి చెత్త నిర్వహణ సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రెండు రోజుల క్రితం కురిసిన చిన్న వర్షానికి మురుగు కాల్వలు నిండి కాలనీవాసులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మురుగు కాల్వలను శుభ్రం చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ తగ్గడంతోనే సమస్యలు వస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, కింది స్థాయి సిబ్బంది పనిచేస్తున్నారా? లేదా? అన్న విమర్శలు ఉన్నాయి. ఎక్కడచూసినా అనుమతి లేని నిర్మాణాలు, అదనంగా ఫ్లోర్లు, వాణిజ్య నిర్మాణాల్లోను అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నోటీసులు ఇస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపట్టడం లేదంటూ స్వయంగా ప్రజాప్రతినిదులు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా స్పందించిన దాఖలాలు లేవు. నగరపాలక అధికారుల ఉదాసీనత వల్ల అవినీతి ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

తొలిసారిగా మంత్రి టీజీ, ఎంపీ, ఎమ్మెల్యేలు

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహిస్తున్న నగరపాలక సర్వసభ్య సమావేశంలో తొలిసారిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరవుతున్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడదాం



మొక్కను నాటుతున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు శివారులోని క్లస్టర్ యూనివర్సిటీ ప్రాంతంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సెయింట్ జోసఫ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకుడు శ్రీనివాస్, పర్యావరణ సంరక్షణ విభాగం అధ్యక్షుడు తోట హరికృష్ణ, కర్నూలు సిటీ గ్రీన్‌ఫోర్స్, స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొని మొక్కలు నాటారు. క్లస్టర్ యూనివర్సిటీ వెనక ఉన్న రోడ్డు వెంట మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ బాధ్యత కూడా తీసుకుంటామని పర్యావరణ సంరక్షణ విభాగం అధ్యక్షుడు తోట హరికృష్ణ తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పచ్చదనం అభివృద్ధితోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్కను నాటి పెంచాలని సూచించారు. అదే విధంగా కర్నూలు నగరంలో టెర్రస్ గార్డెనింగ్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


మెడల్స్ సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల వ్యక్తిగతంగా క్రమశిక్షణ అలవడుతుందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. స్థానిక కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న హుస్సేన్ ఖాన్ బిల్డింగ్‌లో ఆదివారం జూడో మార్షల్ ఆర్ట్స్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఇటీవల యువత సెల్‌ఫోన్లు, గంజాయి వంటి వాటికి బానిసలుగా మారుతున్నారన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ప్రతి రోజు కొంత సమయం క్రీడలకు కేటాయించాలని సూచించారు. తల్లిదండ్రులు క్రీడల వైపు పిల్లలను ప్రోత్సహించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. కర్నూలులో క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. జూడో మార్షల్ ఆర్ట్స్ శిక్షకులు షకీల్ పాల్గొన్నారు.


మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన పరమేశ్వరుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి బారులుదీరారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సర్వ దర్శనానికి 4గంటలు, శీఘ్ర దర్శనానికి 3గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో వేచిఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు పలు ఏర్పాట్లు చేశారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

చీడపీడలను నివారిస్తేనే మంచి దిగుబడులు

- పంటలసాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వండి
- నంద్యాల ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు సూచనలు


మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త రామకృష్ణారావు

కర్నూలు(అగ్రికల్చర్): మొక్కజొన్న, పప్పు దినుసుల పంటలకు సోకే చీడపీడలను సకాలంలో గుర్తించి నివారించుకుంటేనే మంచి దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని నంద్యాల ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏ.రామకృష్ణారావు తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం సమావేశ మందిరంలో ఆదివారం ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సు కింద నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొక్కజొన్న పంటకు ప్రధాన సమస్య కత్తెర పురుగు... దీన్ని తగిన జాగ్రత్తలతో నివారించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మొక్కజొన్నకు తీవ్ర నష్టం కలిగించే కత్తెర పురుగు నివారించుకునే పద్ధతులపై ఇన్‌పుట్ డీలర్లకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనల ప్రకారం పురుగు మందులు పిచికారీ చేయాలని సూచించారు. పురుగు మందులు మొక్కజొన్న సుడుల్లో పడే విధంగా పిచికారీ చేయాలన్నారు. పప్పు దినుసుల పంటలైన కంది, మినుము, శనగ, పెసర పంటలకు ఆశించే పురుగులు తెగుళ్ల గురించి, వాటి నివారణ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. విశ్రాంత జేడీఏ, దేశీ శిక్షణా కార్యక్రమం సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ... ఇన్‌పుట్ డీలర్లు పంటలకు సోకే చీడపీడలు, వాటి నివారణ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డీలర్లకు వ్యవసాయ పరిజ్ఞానం పెంచేందుకే దేశీ డిప్లొమా కోర్సుపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి అవసరానికి రైతులు డీలర్లనే ఆశ్రయిస్తుంటారని, వారికి చక్కటి సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలని కోరారు. వివిధ మండలాలకు చెందిన ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీని పూర్తిచేయాలి


ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసిన బీజేపీ లీగల్ సెల్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీని త్వరగా పూర్తి చేయాలని ఎంపీ బస్తిపాటి నాగరాజుకు బీజేపీ లీగల్ సెల్ న్యాయవాదులు ఆదివారం విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఈ ఫ్యాక్టరీకి 80 శాతం నిధులు కేటాయించిందని, మిగతా నిధులు ఇవ్వడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీని త్వరగా పూర్తి చేసి కర్నూలు యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అలాగే కర్నూలు నుంచి బళ్లారికి నాలుగు లైన్ల రహదారిని ఏర్పాటు చేయాలన్నారు. గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులు పూర్తి చేసి జిల్లా రైతులను ఆదుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ బి.మోహన్‌రెడ్డి, కో కన్వీనర్ నరసింహులు, న్యాయవాదులు అయ్యస్వామి, శాంతకుమార్, మంజునాథ్, రవి, కె. బలరామ్, జయసింహ, మనోహర్ ఉన్నారు.

వైభవంగా మొహర్రం వేడుకలు

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండలం పుసులూరులో మొహర్రం వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామస్తులు పెద్దస్వామి, దర్గాస్వామి, పీర్ల స్వాములకు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకుంటున్నారు. ఆదివారం పీర్ల స్వాములను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి దర్శించుకున్నారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

- హుండీలో నగదు, వెండి అపహరణ


హుండీని పగులగొట్టిన దృశ్యం

గోనెగండ్ల: పెద్దమరివీడు రోడ్డులో ఉన్న ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. గ్రామస్తులు పూజలు చేసేందుకు ఆలయానికి వెళ్లగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దేవాలయం తలుపులు తెరిచి ఉండడం, హుండీకి రంధ్రం పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించారు. హుండీని పగుల గొట్టి అందులో ఉన్న నగదు, అమ్మవారి వెండి ఆభరణాలు అపహరించారని తెలిపారు.ఈ విషయంపై పూజారులు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణయ్య సీఐ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న రాము

ఆదోని అర్బన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో ఆదివారం పిచ్చికుక్క స్వైర్యవిహారం విహారం చేసింది. ఆరేళ్ల బాలుడు రామును కరిచి తీవ్ర గాయాలపాలు చేసింది. వెంటనే తండ్రి బాలుడిని ఆదోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించిన వైద్యులు, మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. బాలుడి తండ్రి జంబన్న మాట్లాడుతూ.. తమ కాలనీలో కుక్కలు అధికంగా ఉన్నాయని, వాటిని పట్టుకోవాలని మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త హఠాన్మరణం


నివాళులర్పిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త జరదొడ్డి దావీదు గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆదివారం గ్రామానికి వెళ్లి దావీదు పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితో పాటు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నెహిమియా, గ్రామ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, భరత్, భాస్కర్, నాయకులు, తదితరులు ఉన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు స్వామి వారికి ఉదయాన్నే అభిషేక పూజలు, సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతితో పాటు నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. స్థానిక, వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


స్వామివారికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని దాదాపుగా 4వేల మంది భక్తులు దర్శించుకున్నప్పటికీ ఆషాడ మాంసం నేపథ్యంలో రద్దీ తగ్గిందని ఆలయ అధికారులు తెలిపారు. స్వామివారికి దాదాపు 150 వరకు అభిషేకాలు జరిగాయి. తక్కువ సమయంలో దర్శన లభించిడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈఓ రామకృష్ణ పర్యవేక్షణంలో అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రత్యేక హోదా కోసం కేంద్రాన్ని నిలదీయాలి



మాట్లాడుతున్న సాకె శైలజనాథ్

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రాన్ని, ప్రధానమంత్రి నరేంద్రమోదీని నిలదీయాలని రాష్ట్ర మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకె శైలజనాథ్ డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు కె.బాబురావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శైలజనాథ్ మాట్లాడుతూ.. రాష్ట్ర పునర్విభజన జరిగి పదేళ్లు గడిచినా ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేక హోదా సాధించేందుకు సరైన అవకాశం ఉందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం పవన్‌కల్యాణ్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఏపీకి పూర్వ రాజధానిగా ఉన్న కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం నిర్మించ తలపెట్టిన గుండ్రేవుల, తుంగభద్ర డ్యామ్‌ల నిర్మాణాలు ఏమయ్యాయని, హైకోర్టు బెంచ్, స్టీలు ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఎక్కడ ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మునిగిపోయే నావ, ఆ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుందని జోస్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, పీసీసీ అధికార ప్రతినిధి బి.చిన్న రామాంజనేయులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన లత

ఎమ్మిగనూరురూరల్: అత్తింటి వేధింపులు తాళలేక కురవ లత అనే వివాహిత ఆదివారం పెట్రోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రకోట గ్రామానికి చెందిన కురవ గోవిందు, సరస్వతిల కుమార్తెను లతను చెన్నాపురం గ్రామానికి చెందిన బంధువు కురవ విజయ్‌కుమార్‌కు ఇచ్చిన మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. సంతానం కలగలేదని లతను భర్త, అత్త, అవ్వలు వేధించటం మొదలు పెట్టారు. దీంతో మూడు నెలలు ఆమె పుట్టినిల్లు అయిన ఎర్రకోటలోనే ఉండగా.. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేసి నెల క్రితం చెన్నాపురానికి పంపారు. కొన్ని రోజులు బాగానే ఉండి మళ్లీ వేధించడం మొదలు పెట్టారు. 'నీవు చస్తే మేం మా కుమారుడికి మరో పెళ్లి చేస్తాం' అని అత్త, అవ్వలు వేధించేవారు. ఆదివారం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లగా.. ఎర్రకోటలోని తండ్రి గోవిందుకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటునానని, మీరు త్వరగా వస్తే చివరి చూపు చూస్తానని ఫోన్ పెట్టేసి ఇంట్లో ఉన్న పెట్రోల్‌ను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తండ్రి గోవిందు, కుటుంబ సభ్యులు వెంటనే చెన్నాపురానికి చేరుకొని అపాస్మకస్థితిలో ఉన్న లతను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.పరిస్థితి విషయంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లత ఆత్మహత్యాయత్నంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.


సి.బెళగల్ సూర్యోదయం సమయంలో కాంతిరేఖలు

అరుణ వర్ణం.. కనువిందు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లో ఆదివారం ఉదయం ఆకాశంలో అరుణ వర్ణం కనువిందు చేసింది. సూర్యోదయానికి ముందు ఆకాశంలో కనిపించిన కాంతి రేఖలు ఎరుపు రంగులో చూపరులను ఆకట్టుకున్నాయి. సూర్య కిరణాలు మేఘాలను చీల్చుకుని వచ్చినట్టుగా ఎరుపు, తెలుపు వర్ణంలో వెలుతురు ప్రకాశించింది. ప్రకృతి ప్రేమికులు ఈ దృశ్యాలను తమ కెమెరాల్లో ఎంతో ఉత్సాహంగా బంధించారు.